క్లుప్తంగా

విద్యాసాగర్‌రావును కలిసిన బీజేపీ నాయకులు



విద్యాసాగర్‌రావుతో బీజేపీ నాయకులు

కథలాపూర్: మహారాష్ట్ర మాజీ గవర్నర్, బీజేపీ సీనియర్ నాయకుడు సీహెచ్ విద్యాసాగర్ రావు(సాగర్‌జీ)ను వేములవాడలో కథలాపూర్ మండల బీజేపీ నాయకులు సోమవారం కలిశారు. సాగర్‌జీ కుమారుడు వికాశ్ రావు బీజేపీలో చేరడంతో నియోజకవర్గంలో రాజకీయ పరిస్థితులపై చర్చించినట్లు నాయకులు పేర్కొన్నారు. సాగర్‌జీని కలిసినవారిలో బీజేపీ నాయకులు ఎద్మల వినోద్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, బద్రి సత్యం, పల్లె గంగాధర్, మల్యాల మారుతి, కాసోజి ప్రతాప్, ప్రవీణ్ ఉన్నారు.

సొసైటీ సేవలు వినియోగించుకోవాలి



పాస్‌బుక్కులు పంపిణీ చేస్తున్న చైర్మన్

ధర్మపురి: సొసైటీ సేవలను రైతులు వినియోగించుకోవాలని జైనా పీఏసీఎస్ చైర్మన్ సొల్ల నరేశ్ అన్నారు.మండలంలోని జైనా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రైతులు, పాలకవర్గం ప్రత్యేక చొరవతో సంఘం బలోపేతమవుతుందన్నారు. పంట రుణం తీసుకున్న 315 మంది రైతులకు 1.95 కోట్లు మాఫీ చేసినట్లు పేర్కొన్నారు. అంతకముందు సొసైటీ కార్యాలయంలో కస్టమర్ సర్వీస్ సెంటర్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచులు మహేశ్ లక్ష్మారెడ్డి, కేడీసీసీ బ్యాంకు మేనేజర్, ఫీల్డు అసిస్టెంట్లు, పాలకవర్గ సభ్యులున్నారు.

ఈ విద్యాసంవత్సరమే కేజీబీవీ ప్రారంభించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ప్రజాప్రతినిధులు

సారంగాపూర్: బీర్‌పూర్ మండలానికి ప్రభుత్వం మంజూరు చేసిన కస్తూర్బా బాలికల విద్యాలయాన్ని ఈ విద్యాసంవత్సరమే ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ యాస్మిన్‌బాషాకు బీర్‌పూర్ ఎంపీపీ మసర్తి రమేశ్, జెడ్పీటీసీ పాత పద్మ వినతిపత్రం అందజేశారు. వారి వెంట వైస్ ఎంపీపీ బల్మూరి లక్ష్మణ్‌రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చెర్పూరి సుభాశ్ తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

కథలాపూర్: అంగన్‌వాడీ టీచర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కథలాపూర్‌లో తహసీల్దార్ ముంతాజిబొద్దీన్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. ఏళ్లుగా సేవలందిస్తున్న తమను ప్రభుత్వం రెగ్యులరైజేషన్ చేయాలని డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారం పట్ల నిర్లక్ష్యం చేస్తే సమ్మె చేస్తామన్నారు. కార్యక్రమంలో అన్ని గ్రామాల్లోని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

న్యాక్ అకాడమీలో కార్మికులకు ఉచిత శిక్షణ

కోరుట్ల: భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు 15 రోజుల పాటు ఉచిత శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు న్యాక్ జగిత్యాల అసిస్టెంట్ గోలి రమేశ్ సోమవారం ఒక ప్రటనలో తెలిపారు. లేబర్ గుర్తింపు కార్డు కలిగి ఉన్న భవన నిర్మాణ కార్మికులకు ఎలక్ట్రీషియన్, ప్లంబర్, తాపీ మేస్త్రీ, పెయింటింగ్, వెల్డింగ్, తదితర విభాగాల్లో ఉచిత శిక్షణా తరగతులు నిర్వహిస్తామన్నారు. శిక్షణ సమయంలో మధ్యాహ్న భోజనం, యూనిఫాం, హెల్మెట్, నోట్ బుక్, పెన్‌లతో పాటు ప్రభుత్వ కార్మిక శాఖ ద్వారా రూ. 300 స్టైఫండ్ చెల్లిస్తామన్నారు. అభ్యర్థులు ఈ నెల 10వ తేదీ లోపు సమర్పించి అడ్మిషన్ పొందాలని రమేశ్ తెలిపారు. మరిన్ని వివరాలకు 9182519518, 7674095072 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

రోడ్లు ధ్వంసం.. దెబ్బతిన్న పంటలు





కోరుట్ల ఆదర్శనగర్‌లో రోడ్లపై నిలిచిన నీరు



చింతలపేట శివారులో దెబ్బతిన్న రోడ్డు



చింతకుంటలో ఇళ్ల మధ్య నిలిచిన నీరు



మల్లాపూర్: వరదనీటిలో స్కూల్‌కు వెళ్తున్న విద్యార్థులు



మెట్లచిట్టాపూర్ శివారులో నీట మునిగిన పంట పొలాలు

కోరుట్ల/కోరుట్ల రూరల్/ మెట్‌పల్లిరూరల్/మల్లాపూర్/కథలాపూర్/ఇబ్రహీంపట్నం /రాయికల్/ పెగడపల్లి: జిల్లా వ్యాప్తంగా సోమవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుండి కురిసిన వర్షానికి పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. మెట్‌పల్లి మండలం చింతలపేట,రంగారావుపేట,కేసీఆర్ తండా గ్రామ శివారు ప్రాంతాల్లోని లోలెవల్ వంతెనలపై నుండి వరదనీరు ప్రవహించింది. రైతుల పొలాల్లోకి నీరు చేరింది. మల్లాపూర్‌లో భారీ వర్షానికి మోడల్ స్కూల్ విద్యార్థులు మరోసారి ఇబ్బందులు పడ్డారు. కోరుట్ల మండలంలో పెద్ద వాగు ఉప్పొంగి ప్రవహిస్తోంది.పలు చోట్ల రాకపోకలు నిలిచి పోయాయి.లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కథలాపూర్ మండలంలో రోడ్లు జలమయమయ్యాయి. దీంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులుపడ్డారు.కోరుట్లలో భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. వరద నీరు రోడ్లపై ప్పొంగి ప్రవహించాయి. ప్రకాశం రోడ్, ఆదర్శనగర్, ముత్యాల వాడ ప్రాంతాలు జలమయమయ్యాయి.ఇబ్రహీంపట్నం మండలం వేములకుర్తి గ్రామంలో భారీ వర్షంతో సోమవారం విద్యుత్ స్తంభాలు నేలకొరిగి వైర్లు తెగిపోవడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. పెగడపల్లి మండలంలో 65.3 వర్షపాతం నమోదైనట్లు డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు.

ముంపు బాధలు తీరేదెన్నడో?

- చిన్నపాటి వర్షానికే ఇళ్లలో చేరుతున్న వర్షపు నీరు
- దుబ్బలవాడ కాలనీవాసుల అవస్థలు
- డ్రెయినేజీ లేక ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు, నాయకులు



దుబ్బలవాడ కాలనీలో ఇళ్లలోకి చేరిన వర్షపు నీరు

వెల్గటూర్: మండల కేంద్రంలో పారిశుద్య నిర్వహణపై పట్టింపు కరువైంది. డ్రెయినేజీ నిర్మాణం లేక నిత్యం ఇళ్లనుండి వెలువడే మురుగు నీరు ఇళ్లముందే ప్రవహిస్తోంది. తేలికపాటి వర్షానికే వరద నీరు ఇళ్లలోకి చేరి కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డ్రెయినేజీ నిర్మాణం చేపట్టి కాలనీవాసుల కష్టాలు తీర్చాలని పదేళ్లుగా నాయకులు, అధికారుల చుట్టూ తిరిగినా ఇప్పటికీ సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. ఇప్పటికైనా డ్రెయినేజీ నిర్మాణం చేపట్టి తమ కష్టాలు తీర్చాలని కాలనీవాసులు వేడుకుంటున్నారు.

డ్రెయినేజీ నిర్మాణం కోసం పదేళ్లుగా డిమాండ్

మండల కేంద్రంలోని 7వ నెంబర్ రాష్ట్ర రహదారికి పక్కన ఉన్న 9,10 వ వార్డుల్లో ఎస్సీ కాలనీ, దుబ్బలవాడలోని అంతర్గత డ్రెయినేజీల నుంచి వచ్చే మురుగు నీటిని అనుసంధానించే ప్రధాన డ్రెయినేజీ రాష్ట్ర రహదారి పక్కన నిర్మించాలని 10 ఏళ్లుగా కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నా నిర్మాణం చేపట్టకపోవడంతో కాలనీల నుంచి వచ్చే మురుగు నీరు ఇళ్ల ముందే ప్రవహించి కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికలకు ముందు డ్రెయినేజీ నిర్మిస్తామని హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక మర్చిపోవడం నాయకులకు అలవాటైందని, అధికారులకు ఎన్నిసార్లు వినతిపత్రాలు సమర్పించినా అవి పరిష్కారానికి నోచుకోవడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వరదలతో తీవ్ర ఇబ్బందులు

వర్షాకాలం వచ్చిందంటే చిన్నపాటి వర్షానికే వరద నీరు ఇళ్లలోకి చేరి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గత నెలలో కురిసిన భారీ వర్షాలకు ఎస్సారెస్పీ కెనాల్ నుంచి వచ్చిన వరద నీరు ఎస్సీ కాలనీ,దుబ్బల వాడలోని ఇళ్లల్లో చేరి నానా అవస్థలు పడ్డారు. మురుగునీటితో జనాలు రోగాల బారిన పడి డెంగ్యూ, మలేరియా లాంటి రోగాల బారిన పడుతున్నారు.

అనుమతులు వచ్చినా పనులు మొదలు కాలే..

7వ నెంబర్ రాష్ట్ర రహదారి పక్కన ప్రధాన డ్రెయినేజీ నిర్మాణానికి మంత్రి కొప్పుల ఈశ్వర్ రూ.10 లక్షల నిధులు విడుదల చేస్తూ, వెంటనే పనులు ప్రారంభించాలని ఈ ఏడాది జనవరి నెలలోనే ప్రొసీడింగ్ ఇచ్చి స్థానిక నాయకులను ఆదేశించారు. కానీ టెండర్ ప్రక్రియ పూర్తవడానికే 8 నెలలు పట్టింది. రేపు మాపంటూ కాలం వెళ్లదీసిన స్థానిక నాయకులు ఇప్పటికీ డ్రెయినేజీ నిర్మాణ పనులు ప్రారంభించలేదు. మంత్రి ఆదేశించినా స్థానిక నేతలు, అధికారులు మంత్రి ఆదేశాలను నిర్లక్ష్యం చేయడంతో కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పదేళ్లుగా ఎదురుచూస్తున్నాం



దుబ్బల వాడకు డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలని గత 10 ఏళ్లుగా స్థానిక నాయకులకు, అధికారులకు ఎన్నిసార్లు వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకున్న నాథుడు లేడు. మంత్రి కొప్పుల ఈశ్వర్ డ్రెయినేజీ నిర్మాణానికి నిధులు మంజూరు చేసినా స్థానిక నాయకులు 8 నెలలుగా పనులు ప్రారంభించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు.

– బండమీది గోపి, దుబ్బలవాడ కాలనీ

వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు



దుబ్బలవాడకు డ్రెయినేజీ లేకపోవడంతో మురుగు నీరు ఇళ్ల ముందు చేరి చాలా ఇబ్బందులు పడుతున్నాం. వర్షాకాలంలో సమస్య మరింత తీవ్రంగా ఉంటుంది. వరద నీరు ఇళ్లలో చేరి ఇళ్ల నుంచి బయటికి రావడానికి కూడా తీవ్ర ఇబ్బందిగా ఉంది. వెంటనే డ్రెయినేజీ నిర్మాణం చేపట్టి మా కష్టాలు తీర్చాలి.

– బండమీది రమేశ్, దుబ్బలవాడ కాలనీ

ఇళ్లముందే మురుగు నీరు



వివిధ కాలనీ నుంచి వచ్చే మురుగునీరు ఇళ్లముందే నిలవడంతో మలేరియా, డెంగీ లాంటి వ్యాధుల బారినపడి ఆస్పత్రుల పాలవుతున్నాం. సర్పంచ్, ఎంపీటీసీ, స్థానిక నాయకులు, అధికారులను అందరినీ అడిగినా ఎవరూ మా సమస్యను పట్టించుకోవడం లేదు. మా కాలనీకి డ్రెయినేజీ మంజూరు చేసి మా సమస్యకు పరిష్కారం చూపాలి. – లచ్చయ్య, దుబ్బలవాడ కాలనీ

బీజేపీ టికెట్ కోసం తుల ఉమ దరఖాస్తు



దరఖాస్తు సమర్పిస్తున్న తుల ఉమ

కథలాపూర్: వేములవాడ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించాలని ఉమ్మడి కరీంనగర్ జెడ్పీ మాజీ చైర్ పర్సన్ తుల ఉమ సోమవారం అధిష్ఠానానికి దరఖాస్తు చేసుకున్నారు. బీజేపీ నాయకులతో కలిసి హైదరాబాద్ వెళ్లారు. కథలాపూర్ జెడ్పీటీసీగా గెలుపొంది ఉమ్మడి కరీంనగర్ జెడ్పీ చైర్‌పర్సన్‌గా ఈ ప్రాంతంలో ఐదేళ్ల ప్రజలకు సేవ చేశామని, బీజేపీ నాయకురాలిగా పార్టీ బలోపేతానికి తనవంతుగా కృషి చేశానని ఆమె పేర్కొన్నారు.

జగిత్యాల టికెట్ కోసం పడాల తిరుపతి దరఖాస్తు

జగిత్యాలటౌన్: జగిత్యాల బీజేపీ అసెంబ్లీ స్థానానికి తనకు పోటీ చేసే అవకాశం కల్పించాలని బీజేపీ నాయకుడు పడాల తిరుపతి కోరారు. సోమవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో దరఖాస్తు చేశారు. ఆయన వెంట బీజేపీ నాయకురాలు, కరీంనగర్ జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ తదితరులు ఉన్నారు.

జై గణేశ భక్త సమితి జిల్లా అధ్యక్షురాలిగా సరిత

మల్లాపూర్: జై గణేశ భక్త సమితి మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా రేగుంట గ్రామానికి చెందిన ఇనుగుర్తి సరితను నియమించినట్లు ఆ సంఘం వ్యవస్థాపకుడు జైన్ కుమార్ తెలిపారు. సోమవారం సరితకు నియామక పత్రం అందజేశారు. రాబోయే గణేశుడి ఉత్సవాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలకు అనుగుణంగా వినాయక మండపాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. మట్టి వినాయకుడిలనే ప్రతిష్ఠించుకుని పూజలు నిర్వహించాలని సూచించారు. జిల్లా అధ్యక్షురాలిగా నియమించిన జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు జైన్ కుమార్ చారికి, సహకరించిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొద్దు రాజేశ్‌కు సరిత కృతజ్ఞతలు తెలిపారు.

‘ఓట్లు దండుకోవడానికే బీసీబంధు’

మల్యాల: సీఎం కేసీఆర్ పాలనలో అర్హులకు సంక్షేమ పథకాలు అందడం లేదని, కేవలం ఓట్లు దండుకోవడానికే ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బీసీ బంధు, దళితబంధు పథకాలు తెరపైకి తీసుకువచ్చారని కాంగ్రెస్ పార్టీ మండల బీసీ సెల్ అధ్యక్షుడు దిండు ప్రవీణ్ విమర్శించారు. మల్యాలలో సోమవారం మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా బీసీ బంధు కోసం 2 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారని, ఒక్కో దరఖాస్తుకు రూ.350 చొప్పున రూ.70 కోట్లు ప్రభుత్వ ఖజానాకు చేరిందని అన్నారు. మండలంలో 500 మంది బీసీ బంధు కోసం దరఖాస్తు చేసుకోగా, కేవలం 47 మంది ఎమ్మెల్యే అనుచరులకు మాత్రమే మంజూరు చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దొంగ ఆనందరెడ్డి, వెల్మ లక్ష్మారెడ్డి, ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు శనిగరపు తిరుపతి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కటుకం వినయ్, ఇమామ్ పాల్గొన్నారు.

ఎంబీబీఎస్‌లో ఆరుగురు విద్యార్థులకు సీట్లు

రాయికల్: పట్టణానికి చెందిన భోగ మనస్వి, కొంగరి దీక్షిత, కన్నవేని రిషిత్‌రెడ్డి, బద్దం సుదీష్ణ, బండెల జీవనశ్రీ, వడ్లకొండ తిలక్ ఎంబీబీఎస్‌లో సీటు సాధించారు. ఈ సందర్భంగా వీరిని గ్రామస్తులు అభినందించారు.

ఉదయనిధి స్టాలిన్ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ఐక్యవేదిక నాయకులు

ధర్మపురి: సనాతన ధర్మంపై వ్యాఖ్యలు చేసిన తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ దిష్టిబొమ్మను సోమవారం ధర్మపురి హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో పట్టణంలో దహనం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని అవమానించిన, అవహేళన చేసిన ఎంతటి వారికైనా స్టాలిన్ గతే పడుతుందని ఇలాంటి వారికి గత చరిత్ర చదివితే తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు పాల్గొన్నారు.

చిత్ర కథ: అడుగుకో గుంత.. వాహనదారులకు చింత



పెగడపల్లి: మండల కేంద్రంలో విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలోని ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారి అస్తవ్యస్తంగా మారింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్డు గుంతలమయమైంది. గుంతల్లో నిలిచిన నీటితో వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మళ్లీ తెగిన కోనాపూర్ అప్రోచ్ రోడ్డు



కోనాపూర్ వద్ద కోతకు గురైన అప్రోచ్ రోడ్డు

సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాలకు వచ్చే ప్రధాన రహదారిపై కోనాపూర్ గ్రామ శివారులో నిర్మాణంలో ఉన్న హైలెవల్ వద్ద ఏర్పాటు చేసిన అప్రోచ్ రోడ్డు సోమవారం మళ్లీ తెగిపోయింది. దీంతో జగిత్యాల జిల్లా కేంద్రం నుంచి సారంగాపూర్, బీర్‌పూర్ మండలాలకు మళ్లీ రాకపోకలు నిలిచిపోయాయి. పోలీసులు ముందస్తుగా రాకపోకలు నిలిపేశారు. రెండు మండలాల్లో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొరుతున్నాయి. చెరువులు, కుంటలు మత్తడులు దూకి నీరు భారీగా దిగువకు వెళ్తోంది. పంట పొలాలు నీట మునిగాయి.

స్వర్ణకారుల డిమాండ్లను నెరవేర్చాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న స్వర్ణకారులు

ధర్మపురి: తమ డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని తహసీల్దార్ కృష్ణచైతన్యకు సోమవారం స్వర్ణకారులు వినతిపత్రం సమర్పించారు. స్వర్ణకారుల డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ధర్మపురిలో దుకాణాలు మూసి నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా స్వర్ణకారులంతా ర్యాలీగా వెళ్లి తహసీల్దార్‌కు వినతిప్రతం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేట్ షాపుల ఆధిపత్యంలో స్వర్ణకారుడి బతుకు దినదిన గండంగా మారిందని వృత్తిపై ఆధారపడి సాంప్రదాయకంగా జీవనం కొనసాగిస్తున్న స్వర్ణకారులకు నేడు చేతినిండ పనిలేక కుటుంబాలను పోషించుకోలేని పరిస్థితి దాపురించిందన్నారు. చేనేత, గీత కార్మికుల కోసం ప్రభుత్వం అందిస్తున్న పింఛన్ సౌకర్యాన్ని స్వర్ణకారులకు అందించాలని కోరారు. కార్యక్రమంలో స్వర్ణకారులు బెజ్జారపు గంగాధర్, రంగు లక్ష్మినరహరి, మండలోజు శ్రీనివాస్, కట్ట రాజమౌళి, సురేశ్ తదితరులున్నారు.

సంక్షిప్త వార్తలు

ఆరోగ్యమైన సమాజంతోనే దేశాభివృద్ధి

మల్లాపూర్: ఆరోగ్యమైన సమాజంతోనే దేశాభివృద్ధి సాధ్యమని లయన్స్‌క్లబ్ ప్రెసిడెంట్ కనుక సంజీవ్ అన్నారు. సోమవారం మండలంలోని కుస్తాపూర్‌లో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు బీపీ, షుగర్ పరీక్షలు చేసి మాట్లాడారు. బీపీ, షుగర్ వ్యాధులపై ప్రజలకు అవగాహన ఉండాలన్నారు. మారుతున్న జీవన విధానం, ఆహార అలవాట్లతో వస్తున్న వ్యాధుల్లో బీపీ, షుగర్ ఒకటని, ముందుగానే గుర్తించి తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. శిబిరంలో 67 మందికి బీపీ, షుగర్ పరీక్షలను నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ మాజీ అధ్యక్షుడు సాదుల వెంకటస్వామి, సభ్యులు ముత్యాల రమేశ్, పుప్పాల మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉద్యోగులకు సన్మానం

మల్లాపూర్: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి ఈశ్వర్ చేతుల మీదుగా ఉత్తమ ఉద్యోగులుగా ప్రశంసా పత్రాలను అందుకున్న ఎస్సై నవీన్‌కుమార్, తహసీల్దార్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ మల్లేశ్‌లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ రీజినల్ సెక్రటరీ రుద్ర రాంప్రసాద్, సభ్యులు ముత్యాల రమేశ్, క్యాతం సురేశ్‌రెడ్డి, పుప్పాల మహేష్, నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ అభియాన్

పెగడపల్లి: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ అభియాన్ మాసోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఎత్తులు, బరువులు తీయడం, న్యూట్రీ గార్డెన్లు ఏర్పాటు చేయడం, లబ్దిదారులకు సరకులు పంపిణీ చేశారు. చిన్నారులకు అక్షరభ్యాసం, అన్నప్రాసన చేశారు. పోషకాహారంపై బాలింతలు, గర్బిణులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు మహేశ్వరి, సుభద్ర, అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

11 నుంచి పెగడపల్లి సొసైటీలో మీ సేవలు

పెగడపల్లి: మండల కేంద్రంలోని సొసైటీలో ఈనెల 11 నుంచి కామన్ సర్వీస్ సెంటర్ ఏర్పాటు చేసి ప్రజలకు అన్ని సేవలు అందించనున్నట్లు సంఘం చైర్మన్ వోరుగంటి రమణారావు తెలిపారు. సంఘం కార్యాలయంలో సోమవారం మాట్లాడారు. ఇప్పటికే సహకార సంఘం ద్వారా రైతులకు అవసరమగు రుణాలిస్తూ, విత్తనాలు, ఎరువులు విక్రయిస్తున్నామని పేర్కొన్నారు. సేవలను రైతులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఈవో గోపాల్‌రెడ్డి, అనిల్, హైమద్, అంజి తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరతను తీర్చాలి

ఇబ్రహీంపట్నం: రైతులకు సరిపడా యూరియాను వెంటనే సరఫరా చేయాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. సొసైటీల్లో యూరియా లేకపోవడంతో పీచు దశలో ఉన్న మొక్కజొన్నకు, పొలాలకు ఇబ్బంది ఏర్పడుతోందన్నారు. యూరియాను బ్లాక్‌లో అమ్ముతున్నారని, యూరియాతో పాటు ఒక క్రిమిసంహారక మందును తప్పనిసరి కొనుగోలు చేయాలంటున్నారని తెలిపారు. బ్లాక్‌లో యురియా అమ్ముతున్నవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

సోమేశ్వర కొండకు పోటెత్తిన భక్తులు

మల్లాపూర్: మండల కేంద్రంలోని సోమేశ్వర కొండపై శ్రావణ సోమవారంను పురస్కరించుకుని శ్రీ కనక సోమేశ్వర ఆలయం భక్తులతో పోటెత్తింది. కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల నుండి వేలాదిగా భక్తులు మల్లాపూర్ సోమేశ్వర కొండపైకి తరలివచ్చారు. భక్తులు కోనేరులో పుణ్యస్నానం ఆచరించి మడి బట్టలతోనే శ్రీ కనక సోమేశ్వర స్వామికి ప్రీతి పాత్రమైన వరద పాశంను వండి నైవేద్యంగా సమర్పించి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ సంగ గంగరాజయ స్వామి వారికి వరద పాశం సమర్పించారు. ప్రధానార్చకులు ప్రభాకర్‌శర్మ భక్తులతో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.